# భూతవైద్యం

"కరుణకుమార"

●●●

గొల్ల నారాయుడికి, చిన్నప్పటినుంచీ దయ్యాలూ, భూతాలూ, పిశాచాలూ ఉన్నాయని నమ్మకం. నమ్మకంమాత్రమే కాదు. అవి అంటే అతని కెంతో భయం కూడాను. అందువల్లనే పాతికేళ్ల వయస్సు వచ్చేదాకా కూడా, అతనికి చీకట్లో ఒంటరిగా పోవడమంటే భయం. ఎక్కడనైనా పెద్దపెద్ద మర్రిచెట్లుగాని, జువ్విచెట్లుగాని, తుమ్మచెట్లుగాని — ఏ చెట్లయినా సరే, దట్టంగా పెరిగి ఒకచోట గుంపుగా ఉన్నాయంటే, అట్లాంటి చోట్లకూడా అతడు ఒంటరిగా పోలేకపోయేవాడు. చిన్నప్పుడు అతని అవ్వా, తాతా చెప్పుతూ ఉండిన కథల్లో దయ్యాలు తరుచు చెట్లమీదా, ఊరు బయటా, శ్మశానంలోనూ - ఇల్లాంటి స్థలాల్లో విరివిగా నివసిస్తూఉంటాయని అతడు వింటూ వచ్చాడు. ఆనమ్మకాలన్నీ అతనికి గాటంగా మనస్సుకు పట్టిపోయి, ఇప్పటికీ ఆ నమ్మకంతోనే ఉంటున్నాడు. రాత్రిపూట అంటే రాత్రిపూటనే కాదు, పగటి వేళనయినా మంచి నడిజామున, ఓతుమ్మలబీటిలోకి పోవాలన్నా, ఓతాటితోపులోకి పోవాలన్నా, ఓపెద్దచెట్టుకింద ఒంటరిగా పండుకొని నిద్ర పోవాలన్నా, అతనికి ఇంతంత భయం కాదు.

నారాయుడి చిన్నతనంలో ఒకసారి వీధిభాగవతులు హరిశ్చంద్రనాటకం ఆడుతుంటే చూడడానికి వెళ్లాడట! ఆ నాటకంలో హరిశ్చంద్రుడూ, చంద్రమతీ, లోహితాస్యుడూ, నక్షత్రకుడూ — వీళ్లందరూ అడివిలో ప్రవేశించి ఒక చెట్టుక్రింద పండుకొని నిద్రపోతూ ఉన్నారట! అప్పుడు ఆ చెట్టుమీదినుంచి ఒక భూతం వీళ్లమీదికి దూకినట్లు, భాగవతం ఆడడానికి వేసిన పందిరి మీదినించి, కింద పండుకొన్న చంద్రమతీ, నక్షత్రకులమీదికి భేతాళుడి వేషంతో ఒక వికృతాకారంతో గభాలున కిందికి దూకిందట. దాన్ని చూచి, నారాయుడు కెవ్వుమని కేకపెట్టి, జడుసుకొని, ఆ దెబ్బతో పదిహేను లంకణాలు చేశాడట! అదిలగాయతు అతనికి దయ్యాలన్నా, భూతాలన్నా నమ్మకం బలపడడమే కాకుండా అవి సాధారణంగా చెట్లమీదనే ఉంటాయన్న నమ్మకంకూడా బలపడింది.

ఈ దయ్యాల భూతాల భయంతోనే అతనికి ఇప్పటికీ, చచ్చిన శవాన్నిగాని,

చచ్చిన పశువునిగాని, ఆఖరుకు ఒక కుక్కను గాని చూడడానికి జంకు. చిన్నతనంలో అతని తల్లితండ్రి వగైరాలు చెప్పే కథలు ఎప్పుడూ దయ్యాలతోనే నిండిఉండేవి. ఒక మనిషి చచ్చిపోతే అతడు దయ్యం అయిపోతాడనీ, చచ్చిపోయిన పదకొండోరోజుదాకా ఆ దయ్యం, మనిషికి ప్రాణం పోయిన స్థలం లోనే కాచుకొని తిరుగుతూ ఉంటుందనీ, తర్వాత ఏ శ్మశానంలోనో, ఏ చెట్టు మీదనో, ఏ పుట్టమీదనో నివాసం ఏర్పరచుకొని ఉంటుందనీ — ఇట్లాంటి విషయాలన్నీ ఎన్నో అతనిపుర్రెను పట్టిఉన్నవి.

దయ్యాల్లో మామూలు దయ్యాలూ, కొరివిదయ్యాలూ అని రెండురకాలు ఉంటాయని కూడా అతనికి తెలుసు. అతడు చెప్పుతాడు—తాను పద్నాలుగేళ్ల పిల్లవాడుగా ఉండంగా, ఒకనాడురాత్రి తన మేనత్తపక్కలో పండుకొని నిద్రపోతూఉండినాడట! అతనికి రాత్రి నడిరేయి మెళుకువ వచ్చిందట; పక్కలో పండుకొన్న తను కళ్లు విప్పిచూచే వరకు ఎవరో ఒకమనిషి వచ్చి గుమ్మంలో నిలబడి ఉన్నట్టు అతనికి అగుపడిందట! అట్టే చూడగా, ఆమనిషి చచ్చిపోయిన తన మేనత్త పెనిమిటిలాగ ఉన్నాడట! 'మామా, మామా' అని అతన్ని పదిసార్లు పలకరించాడట. కాని ఆమనిషి మాట్లాడకుండానే నిలబడి, చేతులేమో ఇటూ అటూ తిప్పుతూ, పళ్లు ఇకిలించి నారాయుడుమీదికి దూకబోయాడట! ఆరూపం జూచి నారాయుడు భయపడి "అమ్మో! దయ్యమే" అని అరిచి నిద్రపోతూ ఉండిన మేనత్తను గట్టిగా పట్టుకొని కళ్లుమూసుకొన్నాడట! తనకు దయ్యాలమీద గల నమ్మకాన్ని ధ్రువపరచడానికి, ఇటువంటి తన అనుభవాలు ఎన్నో చెప్పుతూ ఉంటాడు—నారాయుడు.

కొన్ని కొన్ని దయ్యాలు రాత్రిపూట పొలాల్లో తిరుగుతూ కుప్పలదగ్గరా, చేలదగ్గరా నిద్రపోయే మనుష్యుల్ని సాయంపట్టి, ఓం ఓం ఓం ఓం అని గంజీకావడి పట్టి మోసుకొనిపోతూ ఉంటాయనీ, కొన్ని కొన్ని దయ్యాలు మనుష్యుల్ని బెదిరించి వాళ్లవంటిమీద ఉన్న గుడ్డలూ, చొక్కాలూ పెరుక్కొని వాటిని ధరించి, అవి ఘోరంగా మనుష్యుల్లాగే తిరుగుతూఉంటాయనీ, కొరివి దయ్యాలయితే - మనిషి వచ్చేదారి కడ్డంగా నిలబడి మంటవేసి, ఆ మనిషిని దారితప్పించి ఇంకోపక్కకి, ముళ్లల్లోకీ, కాలవల్లోకీ, కంచెల్లోకీ తీసుకొనిపోయి చిక్కులు పెట్టుతూ, పకపకనవ్వుతూ ఉంటాయనీ—ఇట్లాంటికథలు తాను చిన్నతనంలో విన్నవి అన్నీ నారాయుడు ఇప్పటికీ చెప్పుతూనే ఉంటాడు.

అంతదూరం ఎందుకు? నారాయుడి తాత ఉండేవాడట! ఆతాత రాత్రింబగళ్లు గొర్రెలు కాచుకొంటూ, ఎప్పుడూ పొలం మీదనే తిరుగుతూ ఉండేవాడట! రాత్రి పూట ప్రతిరోజూ, ఓ ఏడెనిమిది దయ్యాలు జతగా వచ్చి, "తాతా! వక్కా, ఆకూ పెట్టవూ? పొగాకుకాడ పెట్టవూ?" అని అతన్ని బెల్లించుకొని తీసుకొనిపోతూ ఉండేవట! వాటిలో ఆడదయ్యాలు, తాతతో సరా

గా లాడుతూ, అతనిమొలగుడ్డ పట్టుకొని లాగీ, అతనిగోచీ పట్టుకొని లాగీ, అతనిజుట్టు పీకీ—ఈవిధంగా చిలిపిపనులు చేస్తూ వుండే వట! ఈ సంగతులన్నీ నారాయుడు చెప్తూనే ఉంటాడు.

కాని - చిన్నతనంలో తన మేనత్త పక్కలో పండుకొన్నప్పుడు చూచినదయ్యం తప్ప - మళ్లా ఇంతవర కెప్పుడూ, అతడు దయ్యాన్ని చూడలేదు. అయితే దయ్యాలు ఉన్నవనీ, అవి కామరూపులనీమాత్రం అతనికి నమ్మకమే. నమ్మకమయితే చిన్నప్పటికంటె ఇప్పుడు బలమయిపోయింది కాని, దయ్యాలంటే అతనికి చిన్నప్పుడు ఉండినంత భయంమాత్రం ఇప్పుడు లేదు. అది సహజమేగా! వయస్సు వచ్చినకొద్దీ భయాలు తగ్గుతూనే ఉంటవి! అయినా దయ్యాలనేవి మొత్తంమీద దుష్టజంతువుల్లో చేరినవనీ, మనిషయినవాడు ఎప్పుడూ వాటికి ఎడంగా ఉండడమే మేలనీ, నారాయుడి ఉద్దేశం. దయ్యాలుకూడా కొంచె మించుమించు మనిషిలాగే, కాళ్లూ చేతులూ, ముక్కూ-చెవులూ, ఇట్లాంటివి కలిగిఉంటా యని—అతడు చిన్నతనంలో తనమేనత్తపక్కలోచూచినప్పటినుంచీ—అనుకొంటూ ఉన్నందువల్ల, తాను పెద్దవాడయి జ్ఞానం తెలిసినతర్వాత, దయ్యాన్ని పోసి ఒకసారి ప్రత్యక్షంగాచూచి దాని నిజస్వరూపం తెలుసుకొని, సందేహ నివర్తి చేసుకొందామనే తలంపు—అతని కెన్నడూ కలగనూలేదు, ఆప్రయత్నం అతడు చేయనూలేదు. ఇక ఏతావాతా, దయ్యా లున్నవని నమ్మినప్పటినుంచీ, అతగాడు చేస్తూవచ్చినకృషి ఏమిటంటే-దయ్యాలవల్ల తనకు ఏవిధమైన బాధగాని, కష్టంగాని కలగకుండా చేసుకోవాలన్న జాగ్రత్తలో మాత్రం ఉంటూవచ్చాడు.

వాళ్లగ్రామానికి ఒకానొకప్పుడు, ఒకానొక భూతవైద్యుడు వస్తే, "అయ్యా! దయ్యాలూ, భూతాలూ, పిశాచాలూ-ఇల్లాంటివి ఏవీ దరిచేరకుండా ఉండే ఉపాయం చెప్పుదురూ" అని ఆయన్ని అర్థించాడు. దానికి అతడు మంత్రించిన విభూతీ, కుంకుమా పొట్లాలు కట్టి ఇచ్చి ప్రతిరోజూ రాత్రిపూట పండుకొని నిద్రపోయే ముందు వాటిని నుదుట ధరించి నిద్రపోయినట్లయితే, భూత ప్రేత పిశాచ బాధ ఏమీ ఉండదని ఘట్టిగా చెప్పాడు.

ఆప్రకారం నారాయుడు కొంతకాలం చేశాడు. కాని అతనికి ధైర్యం చిక్కలేదు. విభూతీ కుంకుమా ఎన్నిరోజులు ధరించినప్పటికీ తనకు తెలియకుండా దయ్యాలు తనని సమీపిస్తున్నట్టూ, తనని బాధించడానికి ప్రయత్నం చేస్తున్నట్టూ—ఇట్లాగే అతని మనస్సుకు కలవరంగా ఉండేది. అదిగాక, కొన్నాళ్లయినతరువాత విభూతీ కుంకుమా విషయమై తాను కొంతమందిని విచారించి తెలుసుకోగా-అవి మంత్రించి యిచ్చి చాలారోజులయినదనీ, అందువల్ల వాటికి మంత్రశక్తిమ తగ్గిపోయివుంటుందనీ, ఇక అవి పనిచేయవనీ, చెప్పారు. అంతట వాటిని అవతల పారేశాడు నారాయుడు.

తరువాత కొన్నాళ్లకు ఆవూరి కంసాలి శరభయ్యకూడా కొత్తగా భూతవైద్యం నేర్చుకొని చాలామందికి నయం చేస్తున్నాడని తెలిసి, అతనిదగ్గరకుకూడా వెళ్లి సంప్రతించాడు. శరభయ్యకూడా ఏమేమిటో మంత్రాలూ తంత్రాలూ చదివి విభూతికుంకుమా యిస్తూ వాటితోకూడా ఆంజనేయ విగ్రహం చెక్కిన ఒక రాగిరక్షరేకుకూడా మంత్రించి, దాన్ని నారాయుడి మెడలో ముడివేశాడు. ఇక నారాయుడి దగ్గరకుగాని, అతడు ఉండిన చోటికి గాని — జాగ్రదవస్థలో ఉండంగా, దయ్యాలు రానే రాలేవు సరిగదా, ఆఖరుకు స్వప్నావస్థలో నయినా సరే, అవి దరిమేలా రావని — శరభయ్య చాలాదూరం ఎంతో నమ్మకంగా చెప్పాడు.

గొల్ల నారాయుడికి మునపటికంటె ఇప్పుడు మరింత ధైర్యం కలిగింది. కాని — రాగిరక్షరేకు సరిగా పనిచేస్తున్నదా లేదా అనిమాత్రం అత నెన్నడూ పరీక్షగా చూడలేదు. కొన్నిరోజులు గడచేవరకు అతనికి దానిమీదకూడా నమ్మకం తగ్గుతూవచ్చింది; ఎందువల్లనంటే — అతడు రాత్రిళ్లు నిద్రపోతూఉంటే ఏవో పెద్దపులులూ, సింహాలూ, తాచుపాములూ — ఇట్లాంటి దుష్టజంతువులు అతన్ని తరుముకొని వస్తున్నట్టూ, వాటిని తప్పించుకోవాలని తాను ఎంతో ప్రయత్నంచేస్తున్నట్టూ, తా నెంతప్రయత్నించినా తనకు అడుగు ముందుకు సాగకుండానే నిలబడిపోతూ ఉండినట్లూ—ఇట్లాంటికలలు రోజూ ఎన్నో వస్తూ ఉండేవట! ఇది ఎందువల్లనా, నిద్రలో మనస్సు ఇంత భీతి చెందడానికి కారణ మేమా అని నారాయుడు కొంతమందితో సలహాపడగా - అది అంతా దయ్యాలూ, పిశాచాలూ చేసే చేష్టలని వాళ్లు చెప్పారట! అయినా కంసాలి శరభయ్యతో వివరాలన్నీ చెప్పి మళ్లా మంత్రం వేయించుకొందామని, అతనివద్దకు వెళ్లాడు.

నారాయుడు చెప్పిన విషయం శరభయ్య శ్రద్ధగా విని "నీకేమీ భయంలేదు: నిజంలో రక్షరేకు పనిచేస్తున్నది కాని, పని చేయకుండా పోవడంలేదు. అయినా, ఇంకొక్క పనిచేస్తావా" అని అడిగాడు.

"చేస్తా" నన్నాడు నారాయుడు.

"నువ్వు చదువుకొన్నావా?"

"ఏదో వానకాలం చదువు చదువుకొన్నాను."

"నీకు ఆంజనేయదండకం పుస్తకం ఒకటి ఇస్తాను. ఆ దండకం నోట వర్లించి, కంఠోపాఠం పట్టగలవా? దండకంగనక కంఠస్థంగా వచ్చిందంటే, ప్రతిదినమూ రాత్రి పండుకొనేముందు దాన్ని పఠించి నిద్రపోతే నీకు ఆస్వప్నాలుకూడా రావు."

"నేను సంతకంమాత్రం ఎట్లాగో చేస్తాను గాని, పుస్తకం తీసుకొని చదవడానికి నాచేత కాదే? ఎట్లా?"

"అట్లానా? — అయినా పరవాలేదు. ఒక పదిహేనురోజులుమాత్రం, ప్రతిరోజూ రాత్రి భోజనం చేసుకొని నా యింటికి రా. రోజూ కొంచెం కొంచెంగా, నీకు ఆదండకం

నేను చదివి చెప్తూ ఉంటాను. ఒక్కొక్క ముక్కే నాతోపాటు నువ్వుకూడా అంటూ ఉంటే, పదిరోజులకల్లా నీకు దండకం కంఠస్థం అయిపోతుంది.. మరి అట్లా రాగలవా?"

"అబ్బో! అంతపెద్ద దండకం, నాకు నోటపట్టుతుందా, నాకు జ్ఞాపకం ఉంటుందా?"

"ఓయి పిచ్చివాడా! నీ కాభయం ఏమీ పనిలేదు. నీకంటెకూడా అక్షరమ్ముక్క రాని మొద్దులికి ఎంతమందికి చెప్పాను — ఈ దండకం? రెండోవాడి సహాయం లేకుండా, నీచేత దండకం చెప్పించేపూచీ నాది—."

"అట్లా అయితే సరే"

"ఇంకొక్క విశేషం: ఈ దండకం నీకు పూర్తిగా వచ్చిన తర్వాత నాకు పది రూపాయల ఖర్చు ఒకటి ఉన్నది! ఆంజనేయస్వామి ఉగ్రశాంతికొరకు, నేను ఒక రోజు ఇంత పూజా, పురస్కారమూ చేసి సంతర్పణ జరిపించవలసి ఉంది. ఆ ఖర్చు భరించే బాధ్యతమాత్రం నీవు పెట్టుకోవలసి ఉంటుంది."

"నీ ఇష్టప్రకారమే కానీ" అని నారాయుడు అంగీకరించాడు."

శరభయ్యమీద ఒకవిధమైన గురి కుదిరింది నారాయుడికి. అతడు దినమ్మూ రాత్రి భోజనంచేసి కంసాలి శరభయ్యవద్దకి పోయి రెండునెలలకు ఆంజనేయదండకం పూర్తిగా కంఠోపాఠం వచ్చేలాగ చెప్పించుకొన్నాడు; శరభయ్య కోరిన పదిరూపాయలు సంభావనా యిచ్చాడు. ప్రతిదినమూ, రాత్రి పండుకొనే ముందు నారాయుడు ఆంజనేయదండకం చదువుకోవడమూ, శరభయ్య యిచ్చిన విభూతీ, కుంకుమా ముఖాన్న ధరించడమూ, గుండెమీద చెయ్యివేసి నిద్రపోవడమూ— ఈవిధంగా జరిగిపోతున్నాయి రోజులు.

మూడుమాసములు జరిగింది. నాలుగు నెలలు గడచింది. దండకం ఒకరకంగా కొంత పనిచేసినట్టుగానే తోచింది నారాయుడికి. ఇదివరకులాగ పీడకలలూ, ఆబాధలూ ఆట్టే రావడంలేదు. కాని అతనికి ఓ పెద్దసందేహం కలిగింది. ఒకవేళ తాను ఏ రాత్రిపూట అయినా, ఏ చెట్టుకిందనుంచి అయినా, లేక ఏ పొలంలోనుంచి అయినా ఒంటరిగా పోవలసి ఉన్నప్పుడు, ఒకానొకదయ్యం తన కెదురుగ్గా తటస్థపడితే ఎట్లా? అప్పుడు ఆంజనేయదండకం చదివినంతమాత్రంచేత దయ్యం పారిపోతుందా? పారిపోతుందని శరభయ్య చెప్పినమాట నిజమేనా? ఏమో? పారిపోతుందో పారిపోదో! నోటితో మంత్రం చదివితే అంతమాత్రంచేత దయ్యానికి నిజంగా భయం ఉంటుందా? తాను ఒంటరిగా ఉండే సమయంలో ఒకటికి రెండూ మూడూ దయ్యాలు తోడయి వచ్చినట్లయితే ఎట్లా? అప్పుడేం చేయాలి? అని అతనికి సందేహం కలిగింది. వెళ్లి మళ్లా శరభయ్యనే సంప్రదించాడు. అతడేదో సమాధానం చెప్పాడు; కాని నారాయుడికది తృప్తికరంగా ఉండలేదు. పైగా ఈ మధ్య తాను రోజూ ఆంజనేయదండకం పఠించి పండుకొన్నప్పటికీ కూడా రాత్రి స్వప్నంలో

దయ్యాలు మళ్లా అప్పుడప్పుడు కనిపిస్తూనే ఉన్నాయి. పదిహేనురోజుల కిందట ఒక రాత్రి మంచంమీద వెల్లకిలా గుండెలమీద చెయ్యివేసుకొని తాను నిద్రపోతూ ఉండడమూ, ఎవరో ఒక మనిషి వచ్చి తన గుండెలమీద కూర్చొని పీక చేత్తో పట్టుకోవడమూ, తాను పెద్దంగా అరవాలని ప్రయత్నం చేయడమూ, ఎంత ప్రయత్నించినా నోట మాట రాకపోవడమూ, కొంత సేపటికి తాను మంచంమీదినుంచి త్రుళ్లిపడి కేకపెట్టి కిందపడిపోవడమూ, ఇంట్లోవాళ్లది చూచి గోలపెట్టడమూ—ఇంత వ్యవహారం జరిగింది. అదిలగాయతు, తాను దయ్యాలబాధ వదలించుకోవాలని ప్రయత్నం చేస్తూన్న సంగతి దయ్యాలు బాగా తెలుసుకొన్నవనీ, తాను జాగ్రత్తపడినకొద్దీ అవి తన్ను బాగా పట్టుకొని పీడిస్తున్నవనీ, ఇంక శరభయ్యమంత్రం కూడా అంతగా పనిచేసేటట్టు లేదనీ, తానేదయినా ఇంకోదారి తొక్కవలసిన అవసరం ఏర్పడిందనీ—విషయం అంతా మనస్సుకు తెచ్చుకొన్నాడు నారాయుడు.

కాని ఇంకోమార్గం అంటే ఏముందీ? సాధారణంగా దయ్యాలూ, పిశాచాలూ వీటిని మంత్రబలిమిచేతనే సాధిస్తూ ఉంటారు వైద్యులు. కాని ఆ మంత్రబలిమి తనపట్ల వ్యర్థమయిపోయింది. ఇక ఇంకో ఉపాయం ఏమున్నదీ అని అతని కేమీ దారి తోచటం లేదు.

తిరిగాడు తిరిగాడు ఆచుట్టుపక్కల పది ఇరవై మైళ్ల దూరంలో ఉన్న పల్లెలన్నీ తిరిగాడు. తనకు నమ్మకం కల వైద్యులనెల్లా సలహా అడిగాడు. కాని వాండ్లు చెప్పిన ఉపాయాలుగాని, సలహాలుగాని నారాయుడికి సరిపడలేదు. తిరిగి తిరిగి ప్రాణం విసిగి ఒక రోజు తన ఊరికి తిరిగి వస్తున్నాడు.

దారిలో ఇంకొక్కవూరు అతనికి తటస్థపడింది. చుట్టుపక్కల ఊళ్లనుంచి ఆ వూరికి జనం తండాలు తండాలుగా వస్తున్నారు. ఆడవాళ్లు, మొగవాళ్లు, చంటిపిల్లలు — అనేకమంది కుటుంబాలతోకూడా బండ్లు కట్టుకొని కొంతమందీ, కాలినడకని కొంత మందీ వస్తున్నారు. అంతమంది తిరునాళ్ల ప్రజలాగ ఆ ఊరికి రావడానికి కారణమేమని ఆ ప్రయాణీకుల్నే అడిగాడు. ఆ ఊళ్లో ప్రతియేటా ఆషాఢ శుద్ధ పంచమికి వీరభద్రస్వామి తిరునాళ్లు జరుగుతుందనీ, ఆ వేడుకలు చూడడానికీ, వీరభద్రస్వామికి కానుకలు చెల్లించుకోవడానికీ జనంవస్తున్నారనీ నారాయుడు తెలుసుకొన్నాడు. అతనికి కూడా తిరునాళ్లు చూడాలని కోరికపుట్టింది. ఆ జనంలో ఒకగొల్లకుటుంబంతో పరిచయం కల్పించుకొని వాళ్లతో కూడా ఊళ్లోకి వెళ్లాడు.

సాయంత్రం అయ్యేవరకు ఊరు ఈనినట్లు ఏ సందుగొందుల్లో పట్టినా జనమే-తిరునాళ్లప్రజలే. రాత్రి అన్నం తిని వీరభద్రస్వామి ఉత్సవం చూడడానికి వెళ్లాడు—నారాయుడు.

ఓ! రాత్రి పట్టపగ లయిపోయింది. వందలకొద్దీజంగమయ్యలు చిన్నచిన్నప్రభలు

వీపులకు కట్టుకొని, ముఖాన్నీ కళ్లమీదా విభూతి పెట్టుకొని, మెడలో వెండిలింగకాయలు ధరించి, చేత జేగంటలు పట్టుకొని, వీరాంగం తొక్కుతూ వీరనృత్యం చేస్తున్నారు. మరి కొంతమంది జంగమయ్యలు కంచుగంటలకు చుట్టూ నల్లచేవ చందనపు కొయ్య తిప్పుతూ, ఓంకారశబ్దం సృష్టించి, ఆ శబ్దంతో కూడా శంఖారావం మేళవించి నాదబ్రహ్మానికి శ్రుతులు వేస్తున్నారు. వీరణాలూ, డోళ్లూ, సన్నాయిమేళం — వీరాంగం తప్ప మరొకశబ్దం చెవికి వినరావడం లేదు. ఇద్దరు మనుష్యులు — ముఫ్ఫయ్యేళ్ల వాళ్లు, కంఠంలో ఒకడూ, నోటిలో ఈబుగ్గలోనించి ఆ బుగ్గలోకి వచ్చేటట్టుగా ఇంకొకడూ, చెరొక శూలమూ గుచ్చుకొని, రక్తప్రవాహంతో తడిసిన శరీరం మరిచి ఉత్సవంలో ఊరేగుతున్నారు. ఇంకొక కంసాలిబత్తుడు — ఒక మణుగు బరువు గల (ఇనప) అగ్నిశూలాన్ని నాలుకచివర గుచ్చుకొని, ఆశూలం మొదలు ఒకచేత్తో పట్టుకొన్నాడు. ఆ శూలానికి పైభాగం అంతా పలవలూ, చిలవలూ వేసిన చిన్నతులసిచెట్టులాగా, షుమారొక వందసూదు లున్నవి. ఒక్కొక్క సూదికి చమురులో నానవేసిన ఒక్కొక్క నూలుకండె గుచ్చి వెలిగించారు. నూరునూలుకండెలూ ఒక్కసారి భగ్గున మండిపోతున్నవి. ఎర్రగా కాలిపోతూఉన్న అగ్నిశూలం కంసాలిబత్తుడి నాలుకమీదనే నిలబడిపోయింది. అదొక అగ్నిగోళంలాగా ప్రజ్వలిస్తూ ఉత్సవంలో ఊరేగుతోంది. ఇంకా కొంతమంది జంగాలూ, శైవులూ ఉరుము లురిమేటట్టు "అశ్శరభ, శరభా, అల్లల్లవీర" అని ఖడ్గాలు చదువుతున్నారు. ఈ నారసాలవారి, శూలాలవారి వెనుక, ఉత్సవంలో నట్టనడుమున ఒక నలభయిఏళ్ల ఆడమనిషి, ముఖం అంతా పసుపు పులుముకొంది. రూపాయంత కుంకంబొట్టు ధరించింది. తడిగుడ్డలు కట్టుకొంది. తడితలనే ముడివేసుకొంది. వెండిపొన్నులు చుట్టిన పేపబెత్తాన్ని ఈ చివరా ఆ చివరా చెరొక చేత్తోను ఆమె పైకెత్తి పట్టుకొన్నది. ఆమెను ఇద్దరు మనుష్యులు సందిట పట్టుకొన్నారు. ఆమెకు ఉగ్రం తగ్గేటట్టు సాంబ్రాణిపొగ ధూపం వేస్తున్నారు. అక్కడక్కడ బిందెలతో నీళ్లు తెచ్చి ఆమెనెత్తిన దిమ్మరిస్తున్నారు. ఆమెకే వీరభద్రస్వామి ఆవేశించాడని ప్రజ లంటున్నారు. అమెకు చేతులెత్తి మొక్కుతున్నారు. అశేష జనమూ ఒకవిధమైన వీరావేశంతో మైమరచి తిరుగుతున్నారు.

ఈ తిరునాళ్ల ఉత్సవం నారాయుడెన్నడూ చూడలేదు. అదొక నూతనసృష్టిగానూ, నూతన ప్రపంచంగానూ ఉన్నదతనికి. రాత్రితెల్లవార్లూ ఆజనంతో కలిసి ఉత్సవంలో తిరిగాడు - నారాయుడు.

తెల్లవారింది. ఉదయం ఏడు గంటలకు వీరభద్రస్వామి ఆలయందగ్గర మంటపంలో కూర్చుని ఉన్నది — రాత్రి స్వామిపూనిన ఆడమనిషి. ఒకబారెడుపొడుగునా, బొటనవ్రేలిలావునా - బటువైన ఒకపేపబెత్తం ఆమె

చేత పట్టుకొని కూర్చున్నది. ఆడవాళ్లూ మొగవాళ్లూ ఆమెకెదురుగాపోయి సాగిలపడుతున్నారు. ఆజనంలో ఒక్కొక్కరినే ఆమె ముందుకు తనదగ్గరికి పిలుస్తోంది. వచ్చిన ఆడమనిషినిగాని, మొగమనిషినిగాని జుట్టు పట్టుకొంటోంది. చేతిలోనిబెత్తంతో శరీరం మీద ఛెడేలు ఛెడేలుమని అంటిస్తోంది. ఆమె చేత జుట్టుచిక్కిన మనిషి గడగడ వణకిపోతోంది. "బాబో! బాబో! నాయనో! పోతాను. నేను లేచిపోతాను. ఇక్కడ ఉండను. నన్ను విడిచిపెట్టు" అని గొల్లున కేకలుపెట్టి ఏడుస్తోంది. ఈ ప్రకారం ఒకరి తర్వాత మరొకరుచొప్పున మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యే సరికి సుమారొక వందమందిని, ఆబెత్తంతోనే ఆ ఆడమనిషి చావగొట్టింది.

ఈ చర్య అంతా కంటిమీద రెప్ప వాల్చకుండా గమనిస్తున్నాడు నారాయుడు. అతని కిదేమీ అర్థం కావడం లేదు.

"ఎందుకయ్యా! ఆ ఆడమనిషి అట్లా కొట్టుతుంది. వీళ్లు ఇట్లా ఏడుస్తున్నారు?" అని తనతోకూడా ఉండిన గొల్లవాళ్లని అడిగాడు నారాయుడు.

"వాళ్లకు గాలిపట్టినందువల్ల, ఆమె వదలగొట్టుతోంది."

"గాలి అంటే ?"

"గాలి అంటే ఎరగవూ? గాలి అంటే దెయ్యం. ఆడవాళ్లకిగాని, మొగవాళ్లకిగాని దయ్యం పట్టి పీడిస్తూ ఉంటే, ప్రతిఏటా ఈ తిరనాళ్లకు వచ్చి మొక్కుకొంటే, మళ్లా జన్మజన్మానికీ, దయ్యమనేది రాకుండా ఈమె వదిలించి పంపివేస్తుంది."

"అయితే ఆమె అట్లా కొట్టడం ఎందుకు ?"

"కొట్టకుంటే దయ్యం విడిచిపెట్టి పోతుందా? దెబ్బకు తప్ప మరి దేనికీ లొంగదు-దయ్యం."

"అట్లాగునా ? కొంతమంది భూత వైద్యులు మంత్రించిన విభూతీ, రక్షరేకూ - ఇట్లాంటివి ఇస్తూఉంటారే, వాటివల్ల దయ్యాలకు భయం లేదు కాబోలు" అని ఊహించి ప్రశ్నించాడు నారాయుడు.

"అబ్బే! అట్లాంటి వైద్యాలు ఏమీ పనిచేయవు. ఎన్ని చేసినా, దెబ్బకొట్టే వైద్యం తర్వాతనే—ఏవైద్యమైనా. మంత్రం చేతనే దయ్యాన్ని లోగట్టుకోగలిగితే, ఇంత మంది జనం ఈడకి రావడ మెందుకు ? ఆమెచేత చావ దెబ్బలు తినడం ఎందుకు ? దెబ్బ దేవేంద్రలోకం— అన్నట్లు, దయ్యానికల్లా పడవలసింది దెబ్బే!" అని వాళ్లు సమాధానం చెప్పారు.

ఈ విషయం అంతా ఆశ్చర్యంగా వుంది నారాయుడికి. దయ్యం దెబ్బకు భయపడుతుందా ? అని అనుకొన్నాడు - మరి తాను ప్రత్యక్షంగా చూస్తూనే వున్నాడు అక్కడ. అందులో నిజం లేకుంటే అంతమంది జనం ఆ ఆడమనిషిచేత ఆవిధంగా చావ దెబ్బలు తింటారా ?

నారాయుడికి సందేహనివర్తి అయిపోయింది. ఆరోజున అతనికి గలిగిన ఉత్సాహానికీ, సంతోషానికీ మేర లేదు.

ఒక్క ఆడమనిషి ఇన్ని దయ్యాలని జయించిందే, తాను మొగవాడైకూడా ఇంకా భయం ఎందుకు ?

ఆ రాత్రి భోజనంచేసి నెల క్రుంకే వరకూ వీరభద్రస్వామి ఉత్సవమూ, నిప్పుల గుండమూ, వీరపూజా చూచుకొన్నాడు. అన్ని వేలమంది ఒక్కచోట చేరడం, ఆ జనం చేసుకొనే వేడుకలు, వాళ్ల ఉత్సాహం, వాళ్ల ఆవేశం, శరీరాలకు ఆవేశం ఎత్తించే వీరాంగం, సాంబ్రాణిపొగా — ఇవన్నీ చూస్తే అతనికీ ప్రపంచం యావత్తూ అవలీలగా గోటితో మీటివేయగలం అన్న ధైర్యం గలిగింది. ఇక ప్రపంచంలో గల దయ్యాలనుగాని, భూతాలనుగాని, పిశాచాలను గాని— చెప్పుకింద తేలులాగ నేలబెట్టి రాచిపారెయ్య వచ్చునని అతనికి ధైర్యం కలిగింది. ఒకటిగాదు, లక్షదయ్యాలు కలసివచ్చినా, తన అధికారానికి లోబడి ఉండవలసిందే గాని, ఇదవరకులాగ తోకాడించడానికి మాత్రం వీలు లేదనుకొన్నాడు; తన జెబ్బపుష్టి చూచుకొన్నాడు. రెక్కలలో తిరిగిన కండలు పైకి పొంగినై. ఇక తనకు ఆ ఉత్సవంతోగాని, ఆ వేడుకలతోగాని పని ఏమున్నదని అనుకొన్నాడు. వెంటనేబయలుదేరి వేకువజాముకు తనఇల్లు చేరుకోవా లనుకొన్నాడు. చేతకఱ్ఱ పుచ్చుకొని, కాలికి చెప్పులు తొడిగి, రాత్రి నెల క్రుంకిన తరువాత ఆ చీకట్లోనే ఏకాయెకీని ఇంటికి ప్రయాణమైనాడు.

వీరభద్రస్వామిఉత్సవంలో ఎక్కిన కైపులో అతనికళ్లకి చీకటి అనిగాని, దయ్యం అనిగాని, పురుగు అనిగాని, పుట్ర అనిగాని, భయం అనిగాని, — ఏమీ తెలియడం లేదు. విల్లువిడిచిన శరంవేగంతో, ఆ రోడ్డు ఎక్కి చరచర చరచర నడిచిపోతున్నాడు. అతనికి పొద్దు తెలియలేదు. శరీరం తెలియలేదు. ప్రపంచమే తెలియలేదు. తన కేదో పెన్నిధానం దొరికినట్లు పట్టరాని సంతోషం. రాజ్యాధిపత్యం లభించినట్లు— అధికారగర్వం. శత్రువును బరిమార్చడానికి రణరంగానికి దూకే భారత యోధుడిలాగ, పరుగుమీద పోతున్నాడు నారాయుడు.

చీకటి బాగా దట్టంగా ఉంది. తన ఊరికి వెళ్లే డొంకలో ప్రవేశించాడు. నడక వేగం తగ్గలేదు. ఊరు ఇంకా రెండు ఫర్లాంగుల దూరం ఉన్నది. డొంకకి తూర్పుతట్టు జీబురుమంటూ తాటితోపూ, పడమటితట్టున తుమ్మలబీడూను నక్షత్రాల గుడ్డివెన్నెలను కూడా మింగేశాయి చెట్ల గుంపులు. ఆ చెట్లగుంపు దయ్యాల కాటపట్టని, నారాయుడికి ఉగ్గుబాలతోనే తెలుసును. దయ్యాల మధ్యకి తాను వచ్చినట్టు తటాలున స్ఫురణకు వచ్చింది. తల పైకెత్తి ఇటూ, అటూ కలయజూచాడు. ఎదురుగా ఒక నలభై ఏభయి గజాల దూరంలో ఒక డొంకలో ఇటూ, అటూ తిరుగుతోంది—దయ్యమేనా?

నారాయుడు తటాలున నిలబడ్డాడు. దయ్యమే కాకపోతే ఈచీకట్లో ఈజీబురులో ఏమనిషి తిరుగుతుంది? చూడగా చూడగా అది తూర్పుగా తాటిచెట్లల్లోకి తప్పుకుంది. దయ్యం పారిపోతోందే అనే ఆత్రంతో, లేడిపిల్లని కబళించే సింహంలాగ ముందు కొక్కదూకు దూకి పరుగుపెట్టాడు. తెల్లని బట్టతో, తలనిండా ముసుగుతో తూర్పుగా తొలగిన దయ్యం, చెట్టుచాటునుండి డొంకలోకి నారాయుడికి పక్కగా వచ్చింది. దయ్యాలభావనలో పడివున్న నారాయుడు "చావు దయ్యమా!" అని చేతిలోని కర్ర ఎత్తి దయ్యంనెత్తినపెట్టాడు. ఒకదయ్యాన్ని జయించానని ఉప్పొంగి పోయినాడు నారాయుడు.

చేతు లూపుకొంటూ, కర్ర ఆడించుకొంటూ, మీసం దువ్వుకొంటూ, దిగ్విజయం చేసివచ్చిన వీరుడిలాగ ఇంటికి పోయి, భార్యను నిద్రలేపి, నారాయుడు తలుపు బిగించుకొని పండుకొన్నాడు.—

కోళ్లు కొక్కొరోకో యని కూశాయి

తెల్లవారి వెలుతురు వచ్చేవరకు,—

తాటితోపుదగ్గర డొంకలో దయ్యాలు వేకువజామునే డొంకలో పేడ పోగు చేసుకోను పోయిన కోమటిముసలిది గోవిందమ్మ నెత్తిణిచాయన్నారు ప్రజలు.


## బసవపురాణము వెల 2-8-0

గ్రంథకర్త:-పాల్కురికి సోమనాథకవి పరిష్కర్త:-వేటూరి ప్రభాకరశాస్త్రి

పంద్రెండవ శతాబ్దమున వెలసిన శైవమతప్రతిపాదక మగు ద్విపదకావ్యము. ఇందు శైవమతోద్ధారకు డగు బసవేశ్వరునియు, తత్పూర్వులు తత్సమకాలీనులు నగు శివభక్తులయు చరిత్రములను సరసముగను, పాఠకులు మనసు కరగి తన్మయు లగునట్లుగను, కవి వర్ణించినాడు. గ్రంథమున మృదుమధురము లగు జానుదెనుగు పలుకుల జాలువార్చి రచనమున ముద్దులు గురియించినాడు. గ్రంథము భిన్నభిన్నమండలములకు జెందిన పెక్కుతాళపత్ర మాతృకలతో సరిచూచి పరిష్కరింపబడినది. పాఠాంతరములు సూచింపబడినవి. పరిష్కర్త రచియించిన అమూల్యమగు పీఠిక (129 పుటలు) ఇందు గలదు. ఆకాలపుటపూర్వ సారస్వతచారిత్రకవిశేషముల లెక్కకు మిక్కిలిగ నందు పరిష్కర్త యేర్చి కూర్చినారు. ఆధునికకవికుమారుల కిది యత్యంతోపకారకము.

మేనేజరు, ఆంధ్రగ్రంథమాల, నెం 7, తంబుసెట్టివీథి, మద్రాసు.